17-07-2023 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

# "మధురమైన పిల్లలూ - ఇప్పుడు మీరు తండ్రి, టీచర్, సద్గురువు - ముగ్గురి సమ్ముఖములో కూర్చొన్నారు, తండ్రి కృప ఏమిటంటే వారు టీచరుగా అయి మిమ్మల్ని చదివిస్తున్నారు, సద్గురువుగా అయి తోడుగా తీసుకువెళ్తారు"

**ప్రశ్న:-** పిల్లలైన మీరు తండ్రితో చేసిన ప్రతిజ్ఞ ఏమిటి? మీ కర్తవ్యము ఏమిటి?

**జవాబు:-** తండ్రితో ప్రతిజ్ఞ ఏమిటంటే - బాబా, మేము మీ నుండి ఏదైతే వింటామో, దానిని ఇతరులకు కూడా తప్పకుండా వినిపిస్తాము, తమ సమానంగా తయారుచేస్తాము. మన కర్తవ్యము తండ్రి సమానంగా అందరినీ చదివించడము ఎందుకంటే ఇప్పుడు బుద్ధి తాళం తెరుచుకుంది. ఏ విధముగా మనం వారసత్వాన్ని తీసుకుంటున్నామో, అదే విధంగా దయార్ద్ర హృదయులుగా అయి ఇతరులకు కూడా వారసత్వాన్ని ఇప్పించాలి.

**పాట:- తల్లిదండ్రుల ఆశీర్వాదాలను తీసుకోండి...**

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. చదువులో మాత, పితలను ఫాలో చేయాలి. ఉన్నతోన్నతమైన ధామం నుండి భగవంతుడు మమ్మల్ని చదివించడానికి వస్తారు అని సంతోషముగా ఉండాలి.
2. ఇప్పుడు మనం తిరిగి మధురమైన ఇంటికి వెళ్ళాలి, అందుకే అశరీరిగా అయ్యే అభ్యాసము చేయాలి. దేహ సహితంగా అన్నీ మర్చిపోవాలి.

**వరదానము:- శబ్దము నుండి అతీతముగా శ్రేష్ఠ స్థితిలో స్థితులై ఉంటూ శాంతి శక్తిని అనుభవము చేసే మాస్టర్ బీజరూప భవ**

శబ్దము నుండి అతీతంగా ఉండే శ్రేష్ఠ స్థితి సర్వ వ్యక్త ఆకర్షణల నుండి దూరంగా ఉండే అతీతమైన మరియు ప్రియమైన శక్తిశాలి స్థితి. ఒక్క క్షణమైనా ఈ శ్రేష్ఠ స్థితిలో స్థితులైనట్లయితే దాని ప్రభావముతో మొత్తము రోజంతటిలో కర్మలు చేస్తూ కూడా స్వయములో విశేషంగా శాంతి శక్తిని అనుభవము చేసుకుంటారు. ఈ స్థితినే కర్మాతీత స్థితి, తండ్రి సమానమైన సంపూర్ణ స్థితి అని అంటారు. ఇదే మాస్టర్ బీజరూప స్థితి, మాస్టర్ సర్వశక్తివాన్ స్థితి, ఈ స్థితి ద్వారా ప్రతి కార్యములో సఫలత అనుభవము అవుతుంది.

**స్లోగన్:- ఎవరి ప్రతి మాట మహావాక్యంగా ఉంటుందో, వారే మహాన్ ఆత్మ.**

18-07-2023 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

## "మధురమైన పిల్లలూ - మీరు బుద్ధిహీనుల నుండి వివేకవంతులుగా అయ్యేందుకు ఈ ఆత్మిక యూనివర్శిటీలోకి వచ్చారు, వివేకవంతులు అనగా పవిత్రులు, పవిత్రులుగా అయ్యే చదువును మీరు ఇప్పుడు చదువుతున్నారు"

**ప్రశ్న:-** వివేకవంతులైన పిల్లల ముఖ్యమైన లక్షణాలను వినిపించండి?

**జవాబు:-** వివేకవంతులైన పిల్లలు జ్ఞానంలో సదా రమిస్తూ ఉంటారు. వారికి ఈశ్వరీయ నషా ఎక్కి ఉంటుంది. వారి బుద్ధిలో మొత్తం సృష్టి చక్రపు జ్ఞానమంతా ఉంటుంది. వారికి నషా ఉంటుంది – మన బాబా మన కొరకు పరంధామము నుండి వచ్చి ఉన్నారు, మనము వారితో పాటు పరంధామములో ఉండేవారము, మన బాబా జ్ఞానసాగరుడు, ఇప్పుడు మనము మాస్టర్ జ్ఞాన సాగరులుగా అయ్యాము, మనకు వారు ముక్తి–జీవన్ముక్తుల వారసత్వాన్ని ఇవ్వడానికి వచ్చారు.

**పాట:- నా మనసు్స అనే ద్వారములోకి ఎవరు వచ్చారు...**

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. బుద్ధి ద్వారా అంతటినీ సమర్పణ చేసి ట్రస్టీలుగా ఉండాలి. చాలా జాగ్రత్తగా శ్రీమతమనుసారముగా ప్రతి కార్యాన్ని చేయాలి.
2. బాబాను మరియు వారసత్వాన్ని స్మృతి చేస్తూ అపారమైన సంతోషాన్ని అనుభవం చేయాలి. బాబా స్మృతితో ఈశ్వరీయ నషాలో నిమగ్నమైపోవాలి. సత్యమైన ప్రేయసిగా అవ్వాలి.

### వరదానము:- ఇముడ్చుకునే మరియు సర్దుకొనే శక్తుల ద్వారా ఏకాగ్రతను అనుభవము చేసే సార స్వరూప భవ

దేహము, దేహ సంబంధాలు మరియు పదార్థాల విస్తారము చాలా పెద్దది, అన్ని రకాల విస్తారమును సార రూపములోకి తీసుకువచ్చేందుకు ఇముడ్చుకునే మరియు సర్దుకొనే శక్తులు అవసరము. అన్ని రకాల విస్తారమును ఒక్క బిందువులో ఇమిడ్చివేయండి. నేను కూడా బిందువు, తండ్రి కూడా బిందువు, ఒక్క బిందువైన తండ్రిలోనే మొత్తము ప్రపంచమంతా ఇమిడి ఉంది. కావున బిందు రూపముగా అనగా సార స్వరూపముగా అవ్వటము అనగా ఏకాగ్రమవ్వటము. ఏకాగ్రతా అభ్యాసము ద్వారా క్షణములో ఎక్కడ కావాలనుకుంటే అక్కడ, ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు, బుద్ధి ఆ స్థితిలోనే స్థితి అవ్వగలదు.

### స్లోగన్:- ఎవరైతే సదా ఆత్మికత యొక్క స్థితిలో ఉంటారో, వారే ఆత్మిక గులాబీలు.

19-07-2023 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

## "మధురమైన పిల్లలూ - మీ ఈ జన్మ చాలా అమూల్యమైనది, ఎందుకంటే ఈ సమయంలో స్వయంగా తండ్రి మీ సేవను చేస్తున్నారు, లక్ష్యమనే సబ్బుతో మీ వస్త్రాలను శుభ్రం చేస్తారు"

**ప్రశ్న:-** ఎవరైతే అల్లాను సృష్టి రచయిత అని అంటారో వారిని ఏ ప్రశ్న అడగాలి?

**జవాబు:-** వారిని అడగండి - అల్లా సృష్టిని రచించినట్లయితే మరి రచన కోసం వారికి స్త్రీ కావాలి, మరి అల్లా యొక్క స్త్రీ ఎవరు? గాడ్ ఫాదర్ అని అంటున్నప్పుడు మరి తప్పకుండా మదర్ కూడా కావాలి కదా. పిల్లలైన మీకు ఈ గుహ్య రహస్యం గురించి బాగా తెలుసు. అల్లా యొక్క స్త్రీ ఈ బ్రహ్మ. వీరు మీ పెద్ద తల్లి. ఈ విషయాన్ని మనుష్యులు అర్థం చేసుకోలేరు.

**పాట:- ఈ ఆటనంతటినీ ఎవరు రచించారు...**

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. సింహాసనాధికారులుగా, పక్కా వారసులుగా అయ్యేందుకు పవిత్రత యొక్క ప్రతిజ్ఞను చేసి సొంత పిల్లలుగా అవ్వాలి, ఇతర సాంగత్యాలను తెంచి ఒక్కరితోనే సాంగత్యాన్ని జోడించాలి.
2. తమ సమానముగా తయారుచేసే సేవను చేయాలి. ముళ్ళ నుండి మొగ్గలుగా, మొగ్గల నుండి పుష్పాలుగా తయారవ్వాలి మరియు తయారుచేయాలి. కొత్త వృక్షము యొక్క అంటు కట్టాలి.

## వరదానము:- కర్మల గుహ్య గతి యొక్క జ్ఞాతగా అయి ధర్మరాజపురి శిక్షల నుండి రక్షించుకునే వికర్మాజీత్ భవ

శిక్షల అనుభవమునే ధర్మరాజపురి అని అంటారు, అంతేకానీ ధర్మరాజపురి అంటే ఏదో వేరే స్థానము కాదు, చివరిలో మనం చేసిన పాపాలే యమదూతల వంటి భయంకర రూపంలో ఎదురుగా వస్తాయి. ఆ సమయము పశ్చాత్తాపం మరియు వైరాగ్యం యొక్క ఘడియగా ఉంటుంది, చిన్న-చిన్న పాపాలు కూడా భూతాల వలే అనిపిస్తాయి. పశ్చాత్తాపముతో కూడిన ఆర్తనాదాలు చేస్తూ ఉంటారు, అందుకే ఆ శిక్షల ఫీలింగ్ నుండి రక్షించుకునేందుకు కర్మల గుహ్య గతి యొక్క జ్ఞాతగా అయి సదా శ్రేష్ఠ కర్మలను చేయండి మరియు వికర్మాజీతులుగా అవ్వండి.

## స్లోగన్:- ఎవరైతే తనువు, మనస్సు, ధనముల ద్వారా తండ్రిపై పూర్తిగా బలిహారమవుతారో, వారే కంఠహారముగా అవుతారు.

20-07-2023 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

## "మధురమైన పిల్లలూ - శివబాబా చిత్రాన్ని ఒక చిన్న గదిలో పెట్టండి, ఘడియ-ఘడియ వెళ్ళి వారి ముందు కూర్చొని మాట్లాడుతూ ఉండండి, తద్వారా రోజంతా స్మృతి నిలిచి ఉంటుంది"

**ప్రశ్న:-** కేవలం సంగమయుగములోనే అనుభూతి అయ్యే అద్భుతమైన మరియు కొత్త ప్రేమ ఏమిటి?

**జవాబు:-** విచిత్రుడైన తండ్రిని ప్రేమించడము, ఇది కొత్త ప్రేమ. మీకు తెలుసు- నిరాకారుడైన, విచిత్రుడైన బాబా ఈ సాకారునిలోకి వచ్చారు, మనం వారి ఎదురుగా కూర్చున్నాము, మనకు సంగమములో డైరెక్ట్ ఈశ్వరుని ప్రేమ లభిస్తుంది, ఇది అద్భుతమైన మరియు కొత్త ప్రేమ. మొత్తం కల్పమంతా దేహధారులను ప్రేమించారు, ఇప్పుడు విదేహీ తండ్రిని ప్రేమించాలి. ఇటువంటి ప్రేమ సంగమములోనే ఉంటుంది.

**పాట:- నా మనసు అనే ద్వారము వద్దకు ఎవరు వచ్చారు...**

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. అందరి స్మృతిని సమాప్తం చేసి, బుద్ధియోగాన్ని అందరి నుండి తెంచి ఒక్క తండ్రి స్మృతిలో ఉండాలి. శివబాబా యొక్క చిన్న గదిని తయారుచేసి వారి అవ్యభిచారీ స్మృతిలో కూర్చోవాలి.
2. తమతో తాము మధురాతి-మధురమైన మాటలను మాట్లాడుకోవాలి. మేము మొదట ఎంత సుందరముగా (తెల్లగా) ఉండేవారము, తర్వాత 84 జన్మలను తీసుకొని ఇప్పుడు సంతోషముగా తిరిగి వెళ్తాము... ఈ విధముగా తమతో తాము మాట్లాడుకొని స్వదర్శన చక్రాన్ని తిప్పాలి.

## వరదానము:- స్వచింతన మరియు స్వదర్శన ద్వారా వజ్ర సమానమైన అమూల్య జీవితాన్ని అనుభవం చేసే మచ్చలేనివారిగా కండి

వజ్ర సమానమైన అమూల్య జీవితాన్ని అనుభవం చేసేందుకు సదా స్వచింతన చేయండి మరియు స్వదర్శన చక్రధారులుగా అవ్వండి ఎందుకంటే వజ్రాన్ని మచ్చతో కూడుకున్నదిగా చేసేది కేవలం రెండు విషయాలే - ఒకటి పరదర్శన, రెండవది పరచింతన. ఈ రెండు విషయాలే సాంగత్యపు రంగులో స్వచ్ఛమైన వజ్రాన్ని మచ్చతో కూడుకున్నదిగా చేస్తాయి, అందుకే ఈ మూల బీజాన్ని సమాప్తం చేసి స్వచింతన చేయండి మరియు స్వదర్శన చక్రాన్ని తిప్పండి, అప్పుడు ధూళి మరియు మచ్చలు అంటుకోవు. సదా మచ్చ లేని, సత్యమైన వజ్రముగా, మెరుస్తున్న అమూల్యమైన వజ్రముగా అవుతారు.

## స్లోగన్:- విచిత్రుడైన తండ్రి యొక్క చిత్రాన్ని మరియు చరిత్రను స్మృతి చేసేవారే చరిత్రవంతులు.

21-07-2023 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

## "మధురమైన పిల్లలూ - మొత్తం సృష్టి అంతటికీ పాలనకర్త ఒక్క తండ్రియే, వారు ఎప్పుడూ ఎవరి పాలననూ తీసుకోరు, వారు సదా నిరాకారుడే - ఈ విషయాన్ని నిరూపించి అందరికీ అర్థం చేయించండి"

**ప్రశ్న:-** ఈశ్వరీయ విద్యార్థి యొక్క మొదటి ముఖ్యమైన గుర్తు ఏమిటి?

**జవాబు:-** ఈశ్వరీయ విద్యార్థి ఎప్పుడూ మురళి వినకుండా ఉండలేరు. వారు - మాకు మురళి వినడానికి తీరికే లభించదు అని అనరు. ఎక్కడ ఉన్నా సరే, పాయింట్లను తెప్పించుకునైనా చదువుకుంటారు. ఎన్ని లెక్కలేనన్ని పాయింట్లు వినిపించబడతాయి! ఒకవేళ మురళి వినకపోతే ధారణ ఎలా జరుగుతుంది? ఇది చదువు, సుప్రీమ్ టీచర్ చదివిస్తారు, కావున పిల్లలు ఎప్పుడూ మురళిని మిస్ చేయకూడదు.

**పాట:- నిన్ను పొంది మేము...**

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. మంచి చురుకైన సేల్స్ మ్యాన్‌గా అయి అవినాశీ జ్ఞాన రత్నాల వ్యాపారాన్ని చేయాలి. అవినాశీ ప్రారబ్ధాన్ని తయారుచేసుకునేందుకు మీ బుద్ధి యోగాన్ని ఒక్క తండ్రితో జోడించాలి.
2. పాస్ విత్ హానర్‌గా అయ్యేందుకు సత్యాతి-సత్యమైన ప్రేయసిగా అవ్వాలి. నిరంతరం ఒక్క ప్రియుని స్మృతిలో ఉండాలి.

### వరదానము:- సర్వశక్తివంతుని సహచరునిగా అయి సర్వుల పట్ల శుభ భావనను ఉంచే చింతన మరియు చింతా ముక్త భవ

ఫలానావారి వ్యాధి నయమవ్వాలి, వారి పతి లేక పిల్లలు జ్ఞానంలో నడవాలి, వారి వ్యాపారం బాగుపడాలి... అని చాలామంది పిల్లలు చింతన చేస్తారు. ఈ భావన అయితే మంచిదే, కానీ ఎప్పుడైతే స్వయం తేలికగా అయి తండ్రి నుండి శక్తిని తీసుకుంటారో, అప్పుడే మీ ఈ కోరికలు పూర్తవుతాయి. దీని కొరకు బుద్ధి రూపీ పాత్ర ఖాళీగా ఉండాలి. అందరి కళ్యాణము కోరుకుంటున్నట్లయితే స్వయం శక్తిరూపులుగా అయి, సర్వశక్తివంతుని సహచరులుగా అయి, శుభ భావనను ఉంచి ముందుకు వెళ్తూ ఉండండి. చింతన మరియు చింతా ముక్తులుగా అవ్వండి, బంధనములో చిక్కుకోకండి.

### స్లోగన్:- ఎవరైతే ప్రశ్నల నుండి అతీతంగా ఉంటారో, వారే సదా ప్రసన్నచిత్తులుగా ఉంటారు.

# "మధురమైన పిల్లలూ - మీరు మరణిస్తే మీకు సంబంధించినంత వరకు ప్రపంచము మరణించినట్లే, తండ్రికి చెందినవారిగా అవ్వడమంటే దేహాభిమానము తెగిపోవడము, ఒక్క తండ్రి తప్ప ఇంకేమీ గుర్తుకు రాకూడదు"

**ప్రశ్న:-** అంతిమ సమయం ఆసనమవ్వడాన్ని చూస్తూ ఏ స్లోగన్‌ను సదా గుర్తుంచుకోవాలి?

**జవాబు:-** "కొందరిది ధూళిలో కూరుకుపోతుంది, కొందరిది రాజులు తినేస్తారు..." ఈ స్లోగన్‌ను సదా గుర్తుంచుకోండి. ఎందుకంటే ఇప్పుడు దుఃఖపు పర్వతాలు కింద పడనున్నాయి, అందరి మృత్యువూ జరుగనున్నది. పిల్లలైన మీరైతే ఇప్పుడు తండ్రిపై పూర్తిగా బలిహారమవుతారు, మీ సర్వస్వమూ సఫలమవుతోంది. మీరు ఒక్క జన్మ బలిహారమవుతారు, తండ్రి 21 జన్మల కొరకు బలిహారమవుతారు. 21 జన్మలు మీకు లౌకిక తల్లిదండ్రుల వారసత్వము యొక్క అవసరము ఉండదు. ద్వాపరము నుండి మళ్ళీ ఎటువంటి కర్మలో, అటువంటి ఫలము లభిస్తుంది.

**పాట:- నేను ఒక చిన్న పిల్లవాడిని...**

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. స్వరాజ్యము కొరకు తండ్రిపై బలిహారమవ్వాలి. లక్ష్యము-ఉద్దేశ్యమును సదా ముందు ఉంచుకోవాలి. పురుషార్థము చేసి సూర్యవంశీయులుగా అవ్వాలి.
2. తండ్రి ద్వారా జ్ఞానమనే మూడవ నేత్రము ఏదైతే లభించిందో, అది సదా తెరుచుకొని ఉండాలి. మాయ ప్రవేశించకుండా ఉండేందుకు పూర్తి శ్రద్ధ ఉంచాలి. యోగాగ్ని ద్వారా వికర్మాజీతులుగా అవ్వాలి.

## వరదానము:- సర్వ సంబంధాలతో తండ్రిని తమవారిగా చేసుకొని ఏకరసముగా ఉండే నష్టోమోహా స్మృతి స్వరూప భవ

నష్టోమోహా స్మృతి స్వరూపులుగా అయ్యేందుకు సర్వ సంబంధాలతో తండ్రిని మీవారిగా చేసుకోండి. ఏ దైహిక సంబంధాల పట్ల బుద్ధి యొక్క మోహము ఉండకూడదు. ఒకవేళ ఎక్కడైనా మోహము ఉన్నట్లయితే బుద్ధి భ్రమిస్తుంది. తండ్రిని స్మృతి చేయడానికి కూర్చుంటారు కానీ ఎవరి పట్లనైతే మోహము ఉంటుందో, వారే గుర్తుకొస్తారు. కొందరికి ధనంపై మోహము ఉంటుంది, కొందరికి ఆభరణాలపై, కొందరికి కొన్ని సంబంధాలపై... మోహము ఎక్కడ ఉన్నా, బుద్ధి అటువైపుకు వెళ్తుంది. ఒకవేళ బుద్ధి పదే-పదే వెళ్తే ఏకరసముగా ఉండలేరు.

**స్లోగన్:- ప్రకృతిని దాసిగా చేసుకున్నట్లయితే ఉదాసీనత పారిపోతుంది.**

23-07-2023 ప్రాతః మురళి ఓంశాంతి "అవ్యక్తబాప్‌దాదా" రివైజ్ - 16-03-95 మధువనం

## "సర్వ ప్రాప్తి సంపన్న ఆత్మలకు గుర్తు - సంతుష్టత మరియు ప్రసన్నత"

- ❖ ఈ రోజు సర్వ ప్రాప్తులను కలిగించే బాప్‌దాదా తమ నలువైపులా ఉన్న ప్రాప్తి సంపన్నులైన పిల్లలను చూస్తున్నారు. అధికారులైన పిల్లలు ప్రతి ఒక్కరూ స్వయములో ప్రాప్తుల యొక్క అధికారాన్ని ఎంతగా ప్రాప్తి చేసుకున్నారు అని బాప్‌దాదా చూస్తున్నారు.
- ❖ సంపూర్ణ అధికారము మరియు సర్వ ప్రాప్తులతో సంపన్నమైన ఏ ఆత్మ అయితే సదా అమృతవేళ నుండి రాత్రి వరకు ప్రాప్తుల యొక్క నషా మరియు అనుభవములో ఉంటుందో, ఆ ఆత్మ యొక్క గుర్తు ఏమిటి? ప్రాప్తులకు గుర్తు సంతుష్టత. వారు సదా సంతుష్టమణులుగా అయి ఇతరులకు కూడా సంతుష్టతా ప్రకాశం యొక్క వైబ్రేషన్లను వ్యాపింపజేస్తూ ఉంటారు. వారి ముఖము సదా ప్రసన్నచిత్తముగా కనిపిస్తుంది. ఎటువంటి ప్రశ్నలు ఉండవు, ప్రసన్నంగా ఉంటారు.
- ❖ ఎవరి చిత్తమైతే ప్రసన్నముగా ఉంటుందో, వారి మనస్సు-బుద్ధి యొక్క వ్యర్థపు గతి వేగంగా ఉండదు. సదా నిర్మలంగా, నిర్మానంగా ఉంటారు. నిర్మానంగా ఉన్న కారణంగా తమ ప్రసన్నచిత్తత యొక్క ఛాయలో అందరికీ శీతలతను ఇస్తారు.
- ❖ సదా సంతుష్టంగా ఉండేందుకు అన్నింటికన్నా సహజమైన విధి - సదా మీ ముందు ఏదో ఒక విశేష ప్రాప్తిని ఉంచుకోండి ఎందుకంటే ప్రాప్తిని ఎప్పుడూ మర్చిపోలేరు. ఒకసారి ఒక గుణాన్ని, ఒకసారి మరొక గుణం యొక్క ప్రాప్తిని ఎదురుగా ఉంచుకుంటూ సంతుష్టంగా ఉండండి. ఒకవేళ ప్రాప్తి ఇమర్జ్ రూపంలో ఉన్నట్లయితే ప్రాప్తి ఎదురుగా అప్రాప్తి సమాప్తమైపోతుంది మరియు సదా సంతుష్టంగా ఉంటారు.

### వరదానము:- ప్రతిక్షణం స్వయాన్ని నిండుగా అనుభవం చేస్తూ నిరంతరం సురక్షితంగా ఉండే స్మృతి మరియు సమర్థ స్వరూపులుగా కండి

బాప్‌దాదా ద్వారా సంగమయుగంలో ఏయే ఖజానాలైతే లభించాయో, వాటితో స్వయాన్ని సదా నిండుగా ఉంచుకోండి. ఎంతగా నిండుగా ఉంటారో, అంతగా అలజడి లేకుండా ఉంటారు. నిండుగా ఉన్న వస్తువులోకి ఇంకే వస్తువు దూరదు. సహన శక్తి లేక శాంతి శక్తి లేదు, కొద్దిగా క్రోధము లేక ఆవేశము వచ్చేస్తున్నాయి అని అనలేరు. ఎప్పుడైతే నిర్లక్ష్యము ఉంటుందో లేక డబుల్ లాక్ ఉండదో, అప్పుడే ఏ శత్రువైనా బలవంతంగా లోపలికి వస్తారు. స్మృతి మరియు సేవ యొక్క డబుల్ లాక్ వేయండి, స్మృతి స్వరూపులుగా ఉండండి, అప్పుడు సమర్థులుగా అయి సదా సురక్షితంగా ఉంటారు.

### స్లోగన్:- విశ్వ నవ నిర్మాణము చేసేందుకు మీ స్థితిని నిర్మానచిత్తముగా తయారుచేసుకోండి.